క్లుప్తంగా

సీతంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలోని సీతంపేట గ్రామంలో కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సీతంపేట సొసైటీ పరిధిలో ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ పర్వతనేని రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ రాజా, నాయకులు పాల్గొన్నారు.

మెట్టలో మల్బరీ సాగు



షెడ్లను పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ రత్తయ్య

దెందులూరు : మెట్ట గ్రామాల్లో మల్బరీ సాగు ప్రారంభమైందని సెరికల్చర్ దెందులూరు మండలం టెక్నికల్ అసిస్టెంట్ టీ.రత్తయ్య అన్నారు. శుక్రవారం రామారావు గూడెంలో నిర్మాణం పూర్తైన సాగులో ఉన్న మల్బరీ షెడ్‌లో రైతు కాలి ఇశ్రాయేలుతో కలిసి పరిశీలించారు. సాగు షెడ్డు నిర్మాణానికి రూ.3.60లు ప్రభుత్వం మంజూరు చేసింది అన్నారు. ఇప్పటికీ రూ.2.60 లక్షలు రైతుకు చెల్లించడం జరిగిందని మరో లక్ష రూపాయలు బిల్లు పెట్టామన్నారు.

చల్లగా చూడమ్మా.. చల్లాలమ్మ తల్లీ



చల్లాలమ్మకు గోదావరి జలాలు తీసుకువస్తున్న మహిళలు

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామదేవత చల్లాలమ్మ సన్నిధిలో అయిదు రోజుల ఉగాది సంబరాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కుంభాబిషేకం జరిపారు. ఏలూరు కాలువలోంచి గోదావరి నీరును బిందెలతో తోడ్కొని పోతురాజు గుడి మీదుగా చల్లాలమ్మ ఆలయానికి చేరుకుని మహిళలు బిందెలతో జలాబిషేకారం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వెంపరాలజోగిశాస్త్రి. పవన్‌లు జలాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలకరించారు. ఉత్సవ కమిటీ చైర్మెన్ సూరత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాటెమ్మ తల్లి ఉత్సవాలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

దెందులూరు: చల్ల చింతలపూడిలోని పాటెమ్మ పేరంటాలు తల్లి జాతర ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఎలమర్తి శ్రీనివాసరావు, పెరుగ్గూడెం గ్రామ మాజీ సర్పంచ్ ఎలమర్తి హేమ లక్ష్మి దంపతులు కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. చల్ల చింతలపూడి గ్రామం మాజీ సర్పంచ్ ముమ్మడి మోహనరావు, దెందులూరు మండలం మాజీ వైస్ ఎంపీపీ నాగనబోయిన సత్యనారాయణ తో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు ఉన్నారు.

భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా గీతాంజలి

భీమడోలు: భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా కె.గీతాంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమడోలు మేజిస్ట్రేట్ కోర్టు నందు బార్ అసోసియేషన్ భవనంలో న్యాయవాదులు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా ఇంజేటి విజయ్ అచ్యుతం ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షురాలిగా కె.గీతాంజలి, ఉపాధ్యక్షుడిగా కరణం మోహనశ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.గోపాలకృష్ణ, కోశాధికారిగా ఐ.విజయ్ అచ్యుతం, కార్యదర్శిగా లావేటి సుధారాణి, లైబ్రరీ అండ్ స్పోర్ట్స్ కార్యదర్శిగా బీవీడీఎల్ నారాయణ, మహిళా ప్రతినిధిగా టి.రాణి, కార్యనిర్వాహక సభ్యులుగా 10మందిని ఎన్నుకున్నారు. నూతన సభ్యుల జాబితాలను బార్ కౌన్సిల్‌కు పంపుతామని వారు పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని న్యాయవాదులంతా అభినందించారు.


గర్భిణులకు రక్షణ.. మాతృత్వ వందన యోజన పథకం

- పీఎంఎంవీవై పథకం కింద రూ.5వేల సాయం
- రెండో కాన్పులో మళ్లీ ఆడపిల్ల అయితే రూ.6వేలు సాయం

దెందులూరు: మాతృత్వ వందన యోజన పథకం రెండు విడతల్లో నగుదు చెల్లింపు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం (పీఎంఎంవీవై) గర్భిణులకు, పుట్టిన శిశువు సంరక్షణకు దోహదపడుతోంది. గ్రామాల్లోని పేద, మధ్య తరగతికి చెందిన గర్భిణులకు ఈ పథకం కొంత ప్రయోజకరంగా ఉంది. 2010లో ఈ పథకాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందిరాగాంధీ మాతత్వ సహయోగ్ యోజన(ఐజీఎంఎస్‌వై) నామకరణం చేసి పథకం ప్రారంభించారు. ఇప్పటి ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత 2016లో ఆ పథకం పేరును ప్రధానమంత్రి మాతృత్వం వందన యోజనగా మార్పు చేశారు. ఈ పథకంలో మరింత మందికి లబ్ధి చేకూరాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది.

మరిన్ని మార్పులతో

పథకాన్ని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి మరిన్ని మార్పులు చేసిన తర్వాత అమల్లోకి తీసుకువచ్చింది పీఎంఎంవీవై ద్వారా అందించే నగదు ప్రోత్సాహకాల ద్వారా గర్భిణులు, బాలింతల్లో మెరుగైన ఆరోగ్య కల్పనకు నవజాత శిశు రక్షణకు, శిశు మరణాల నివారణకు, తల్లి, శిశువుకు పోషణ ఆహారం కోసం ఉపయోగపడుతుంది. ఈ పథకాన్ని గర్భిణులకు వర్తింపజేసి విధంగా ఆరోగ్య సిబ్బంది నమోదు ప్రక్రియను నిరంతరం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో గర్భిణులను ఎప్పటికప్పుడు గుర్తించి వైద్యశాఖ రికార్డుల్లో పొందుపరుస్తున్నారు. దీంతో పాటు గత మూడేళ్లగా నమోదు చేసుకోని చిన్నారుల తల్లులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం ద్వారా లబ్ధిపొందే మహిళల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఈ పథకం ద్వారా మొత్తం 450మందికి గుర్తించి పథకంలో నమోదయ్యారు.



పీఎంఎంవీవై పథకం లోగో

కావలసిన అర్హతలివే

గర్భిణం దాల్చిన మహిళ మూడు నెలల్లోపు పీఎంఎంవీవై పథకం కోసం వార్డు, గ్రామ సచివాలయంలోని వెల్‌నెస్ సెంటర్‌లో, లేదా పీహెచ్‌సీలో పేరు నమోదు చేయించుకోవాలి. గర్భిణులు తప్పనిసరిగా మదర్ చైల్డ్ ప్రొటెక్షన్(ఎంసీపీ)కార్డు కలిగి ఉండాలి.19సంవత్సరాలు నిండిన తర్వాత గర్భం దాల్చిన మహిళలకు ఈ పథకం వర్తిస్తుంది. పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతి నెలా 9న నిర్వహిస్తున్న పీఎంఎంవీవై శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి.



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

నగదు చెల్లింపు ఇలా:

- గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం పూర్తైన తరువాత వరకూ ఈ పథకం కిందరూ.5వేలు అందుతాయి.
- గర్భం ధరించిన ఆరు నెలల లోపు మొదటి విడతగా అంగన్‌వాడీ కేంద్రం, లేదా గ్రామ సచివాలయంలో గర్భిణీగా నమోదైన తర్వాత వైద్య పరీక్షలు అనంతరం రూ.3వేల అందజేస్తారు.
- కాన్పు అయిన తర్వాత 14వారాల లోపు బిడ్డకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు వేయించుకున్న వారికి మిగిలిన రూ.2వేలు అందజేస్తారు.
- రెండవ సారి గర్భిణి అయిన ఆ కాన్పులో మొదటిసారి ఆడపిల్ల పుట్టి మళ్లీ రెండవ సారి కూడా ఆడపిల్ల జన్మిస్తే ఆ బిడ్డకు 14వారాల లోపు అన్ని టీకాలు వేయించుకుంటే అటువంటి వారికి ఒకే విడతలో రూ.6వేలు అందిస్తారు.

గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం గర్భిణులకు, నవ జాత శిశువులకు పోషకాహారం అందిచంచాలని వారి సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన పీఎంవై పథకాన్ని మండలంలోని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి. గర్భం దాల్చిన ప్రతి మహిళ వారి వివరాలను నమోదు చేసుకుని పథకం లబ్ధి పొందాలి.

– డాక్టర్ సుందర్ బాబు, సూపరింటెండెంట్ దెందులూరు సీహెచ్‌సీ

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



కోడూరుపాడులో బడ్డీ కొట్టుకు నోటీసులు అంటించిన ఎస్సై పి.శివధర్, సచివాలయ ఉద్యోగులు

భీమడోలు: కోడూరుపాడులోని గ్రామకంఠ స్థలంలో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపును తొలగించాలని గ్రామస్తుడు పి.దశరథరామారావు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. సాక్షిలో శుక్రవారం ఫిర్యాదులోని సమస్య ప్రచురితమైంది. దీనితో సంబంధిత అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భీమడోలు ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్సై పి.శివధర్ కోడూరుపాడులో తనిఖీలు నిర్వహించారు. గ్రామ కంఠం స్థలంలో ఉన్న బడ్డీ కొట్టుకు నోటీసులు అంటించామనిసచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. అదే విధంగా గ్రామంలో దాసరి పెద్దిరాజు అనే వ్యక్తి బెల్ట్ షాపును నిర్వహిస్తున్నదీ లేనిదీ గ్రామస్తుల నుంచి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం లీజు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బి.సత్యనారాయణ హెచ్చరించారు.

వంతెన సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

భీమడోలు: ప్రభుత్వ శాఖల సమన్వయలోపంతో స్లాబ్ దశలో నిలిచిన గుండుగొలను వంతెన నిర్మాణ పనులను కేంద్ర జల రవాణా శాఖ(ఐడబ్ల్యూఏఐ), నేషనల్ హైవే అథారిటీ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించారు. గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై రూ.3.4కోట్ల నిధులతో మూడేళ్లగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణానికి అవసరమైన అనుమతులను కేంద్ర జల రవాణా శాఖ ఉన్నతాధికారుల నుంచి సంబంధిత నిర్మాణ సంస్థ అధికారులు అనుమతులు పొందని కారణంగా ఆ శాఖ వంతెన నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని లిఖితపూర్వకమైన ఆదేశాలను జారీ చేసింది. దీంతో వంతెన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిందని గత నెల 15వ తేదీ సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ విషయంపై ఎంపీ, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్లాబ్ దశలో నిలిచిన వంతెన నిర్మాణ పనులను నేషనల్ హైవే ఆథారిటీ టెక్నికల్ మేనేజర్ సాల్మన్ అస్వోవి, మేనేజర్లు సాయినాథ్, సోమేష్, కేంద్ర జల రవాణా శాఖ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ సురేష్ శర్మ, జూనియర్ ఇంజనీర్ ఆర్.లోకేష్, ఎంపీ ఓఎస్‌డీ రాఘవులు, స్థానిక నాయకులుతో కలిసి పరిశీలించారు.



గ్రామపెద్దలతో చర్చిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తాం

గణపవరం: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పరలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలును కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన రైతు సేవాకేంద్రంలో ధాన్యం కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వ్యవహరించాలని, అవసరమైనన్ని గోనెసంచులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా సివిల్ సప్‌లైస్ డిఎం శివప్రసాద్, మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, ఏడిఏ మురళీకృష్ణ, మండల తెదేపా అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, మండల జనసేన అధ్యక్షుడు తోటశ్రీను, ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, కొలనువాడ శ్రీనివాసరాజు,దాట్ల రంగరాజు తదితరులు పాల్గొన్నారు.



పిప్పరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారాజు

దుగ్గిరాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెదవేగి : మండలంలోని దుగ్గిరాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా, వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్బారావు, మండల పార్టీ ప్రెసిడెంట్ బొప్పన సుధా, పార్టీ సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, దుగ్గిరాల వైస్ ప్రెసిడెంట్ చింతమనేని గోపి, మండల వ్యవసాయాధికారి ప్రియాంక, ఎంపీడీఓ, ఎంఆర్ఓ బ్రమరాంభ, దుగ్గిరాల గ్రామ వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎనిమిది మంది ఎంపిక

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం ఎస్ఎఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ టి.కె.విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. వివిధ కళాశాల నుంచి 22మంది విద్యార్థులు హాజరుకాగా ఎనిమిది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

రీ సర్వేతో ప్రజలకు ప్రయోజనం

భీమడోలు: దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు భూ రీసర్వేతో ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. గుండుగొలను సచివాలయం నెం.2 వద్ద శుక్రవారం భూ రీ సర్వేపై గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగాను ఉంటాయని, వాటిన్నింటిని పరిష్కారించేందుకు సర్వే టీముకు రైతులు తమ వంతు సహాయ సహకారాలను అందజేయాలన్నారు. రైతులు తమ వద్ద గల పట్టాదారు పాసు పుస్తకాలు, లింక్ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్, స్టాంపులును అధికారులకు అందజేయాలన్నారు. అనంతరం పలువురు రైతులు రెవెన్యూ సమస్యలను అధికారుల దష్టికి తీసుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ జి.భరత్, గ్రామకార్యదర్శి తనూజ, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మాజీ సర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు, గ్రామ పెద్దలు డోకల నాగేశ్వరరావు, బొల్లిన కోటేశ్వరరావు, వీఆర్వో డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



భీమడోలు: గుండుగొలనులో రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి



ఉంగుటూరు: వి. ఎ పురంలో రీసర్వే పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ రవికుమార్

రీ సర్వేని సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు: భూ సర్వే వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. శుక్రవారం వి.ఎ పురం గ్రామంలో రీ సర్వేపై రైతులకు అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమలో డిప్యూటీ తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, మండల సర్వేయర్ విశ్వనాథ్, గ్రామ రెవెన్యూ అధికార్లు పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

దెందులూరు: భూముల రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. శుక్రవారం ముప్పవరం గ్రామ సచివాలయంలో రీ సర్వే పై గ్రామసభ జరిగింది. గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడుతూ మలక చర్ల ఏవిధంగా రీ సర్వే చేస్తున్నాము రైతులందరూ గమనించాలన్నారు. రీ సర్వే చేసేటప్పుడు ముందుగానే రైతులకు సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇచ్చిన సమాచారానికి అనుగుణంగా రైతులు సర్వేకు వచ్చి భూములు హద్దులు తెలియజేయాలన్నారు. ఈ గ్రామసభలో మండల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, మండల సర్వేయర్ రమణారావు, గ్రామ నాయకులు రైతులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెదపాడు: కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు హక్కులు చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల సంరక్షణ యూనిట్ కార్యాలయ కౌన్సిలర్ వీ బాలస్వామి తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు గ్రామంలోని గ్రామ స్థాయి బాలల రక్షణ కమిటీ సభ్యుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కిశోర బాలికలకు గ్రామ ప్రజలకు బాల్యవివాహలు, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి, డీసీపీ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయం ఆధునీకరణ పనులు పూర్తి

దెందులూరు: మండలంలోని మేధినరావుపాలెం పంచాయతీ కొవ్వలివారిగూడెంలో రామాలయం ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. కొవ్వలి వారి గూడెం గ్రామస్తుల సహకారంతో గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత ఎం దుర్గా కుమారి రాజు రూ. 3 లక్షలతో ఆలయం ప్రాంగణ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆపనులను గ్రామ పెద్దలతో కలిసి సర్పంచ్ ఎం.దుర్గ కుమారి రాజు శుక్రవారం పరిశీలించారు.



రామాలయంలో ఆధునీకరణ పనులు పూర్తి చేసిన దృశ్యం

వన్‌ధన్ కేంద్రాలను పరిశీలించిన ఐటీడీఏ పీఓ టిప్

బుట్టాయగూడెం: వన్‌దన్ కేంద్రాల్లో తయారు చేసిన ఉత్పత్తులను జోడించి తద్వారా ఆదాయం మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ తెలిపారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం, జిల్లెళ్లగూడెంలో ఏర్పాటు చేసిన వన్‌దన్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చింతపండు ప్రోసెస్సింగ్ యూనిట్‌ను పరిశీలించి అక్కడ మహిళలకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం జీపీఎస్ పాఠశాలను సందర్శించి అక్కడ పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలను, పాఠ్యాంశ బోధనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుట్టాయగూడెం సంత మార్కెట్ వద్ద జీసీసీ ద్వారా ఏర్పాటు చేసిన కారం శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ కారం మిల్ ప్రోసెస్సింగ్ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. అలాగే పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కారం శుద్ధి కేంద్రం ప్రాంగణ స్థలం జీసీసీకే చెందుతుందని చెప్పారు. అయితే ఈ స్థలానికి సంబంధించి తన దృష్టికి వచ్చిందని ఈ స్థలం జీసీసీకే చెందే విధంగా సంబంధిత సర్పంచ్‌తో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ రాజబాబు, జీలుగుమిల్లి వెలుగు ఏపీఎమ్ ఎన్. ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కోసం కోకో రైతుల ఎదురుచూపులు



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె శ్రీనివాస్(ఫైల్)




పెదవేగి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కోకో రైతులు (ఫైల్)

- గళమెత్తినా పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- అన్యాయం జరిగిందని ఆవేదనలో రైతులు

పెదవేగి : లక్షల పెట్టుబడులు పెట్టి కౌలుకు తీసుకుని సాగు చేసిన కోకో రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని గ్రామాల్లో కోకో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వదేశ పంటను రైతులను నిర్లక్ష్యం చేస్తూ, విదేశీ పంటకు ప్రాధాన్యత ఇస్తూ కొన్ని కంపెనీలు సిండికేట్‌గా మారి దేశాన్ని రైతులను అవమానపరుస్తున్నారని ముక్తకంఠంతో విమర్శిస్తున్నారు. గత కొద్ది రోజులుగా కోకో రైతులను ఆదుకోవాలంటూ అన్ని మండలాల్లో అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహించిన విషయం విధితమే. గత కొద్ది రోజుల క్రితం పెదవేగి మండలం విజయరాయిలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సును నిర్వహించారు. కోకో రైతులు వారి గళాన్ని వినిపించి గిట్టుబాటు ధర దక్కించుకునే దిశగా అడుగులు వేశారు.


మద్దతు ధర ప్రకటించాలి



కోకో గింజలకు మద్దతు ధర లేక కుదేలైపోయాం. ఎన్ని ధర్నాలు చేసిన అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అదే నేడు జగన్ సీఎం అయితే కంపెనీల మెడలు వంచి ఇక్కడ కూర్చోపెట్టేవారు. రైతులను అన్యాయంగా వదిలేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లో ఏ పంటకు కూడా మద్దతు ధర లేదు.

– గొడ్డాడి విజయరాజు, రైతు నడిపల్లి గ్రామం


కుదేలైపోయాం



లక్షలు పెట్టి కౌలుకు పొలం తీసుకుని సాగు చేస్తుంటే ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వకుండా చిన్న సన్నకారు రైతులను ఇబ్బంది పెడుతుంది. పాలనలో ఉన్న నాయకులే ఆదుకోవాలి. మార్కెట్ ధర రోజురోజుకూ తగ్గిస్తూ రైతును నష్టపడే విధంగా కంపెనీలు సిండికేట్ అయ్యి నానా రకాలుగా రైతును కుదేలు చేస్తున్నారు.

– దేవళ్లరాజు, రాజశేఖర్ కొండలరావుపాలెం

ప్రభుత్వమే ఆదుకోవాలి



గతంలో కోకో గింజ రూ.800 నుంచి రూ.1000 వరకు కొనుగోలు చేశారు. ఆ ధరలు ఇప్పుడు లేవు. రైతులను ప్రభుత్వాలే ఆదుకోవాలి. రూ.700 నుంచి రూ.800 అయిన గిట్టుబాటు వస్తుందని ఆశించి కౌలుకు తీసుకుంటే నేడు ధర లేదంటున్నారు. పాత కోకో గింజలు రూ.600 , కొత్తది రూ 800 ఉంటే గిట్టుబాటు అవుతుంది.

– పంజగల నరశింహరావు, కొండలరావుపాలెం

రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారు



కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారు. అన్‌సీజన్‌లో గింజలను కొనుగోలు చేయకుండా, లక్షలు పెట్టి భూమిని కౌలుకు తీసుకుని పెట్టుబడులు పెట్టి కోకో సాగు చేసిన రైతులను ఆదుకోకపోతే ఆత్మహత్యలే రైతుకు దిక్కు. రోజురోజుకూ ధరను తగ్గిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధర చెల్లించాలి. కనీసం కిలో గింజలకు రూ.800 ఇచ్చిన కొంత మేర మేలు. విదేశీ కోకో గింజలు నిలుపుదల చేసి, స్వదేశీ గింజలను కొనాలి.

– కె శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెదపాడు : మండలంలోని కొణికి గ్రామంలో నూతన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. విద్యుత్‌శాఖ సూపరింటెండ్ ఇంజనీర్ సాల్మన్ రాజు, డీఈ అంబేద్కర్, ఏఈ రాంబాబు కూటమి నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకలు పాల్గొన్నారు.